సాక్షి
మెదక్
శుక్రవారం । 1 । డిసెంబర్ । 2023


నర్సాపూర్ పట్టణంలోని ఓ పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

న్యూస్‌రీల్

బతికుండగానే చంపేశారు

వృద్ధుడి ఆవేదన


రాములు

వెల్దుర్తి(తూప్రాన్): ఆరు దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్నా... ఈ సారి అధికారులు తనను చంపేశారంటూ మండలంలోని కుకునూర్ పోలింగ్ కేంద్రం వద్ద ఓ వృద్ధుడు ఆవేదన వ్యక్తం చేశాడు. గ్రామానికి చెందిన మోతె రాములు(82) తన ఓటుహక్కు వినియోగించుకోవడానికి పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. ఓటరు జాబితాలో పేరు లేదంటూ బీఎల్‌ఓలు చెప్పారు. ఎందుకు లేదని ప్రశ్నిస్తే ఆయన చనిపోవడంతో పేరును తొలగించినట్లు చెప్పారు. దీంతో రాములు ఖంగుతిన్నాడు. బతికుండగానే ఓటరు జాబితాలో పేరు ఎలా తొలగించారని వాపోయాడు. బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

చలో ఢిల్లీ..
రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

- ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్ట సాధనే లక్ష్యం
- డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్


పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీబీఎఫ్ ప్రతినిధులు

నిజాంపేట(మెదక్): దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం చేయాలని, భారత రాజ్యాంగ స్థానంలో మను అధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని చూస్తున్న బీజేపీ విధానాలను నిరసిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దానిలో భాగంగా డిసెంబరు 4న జరిగే చలో ఢిల్లీకి దళితులు తరలిరావాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ పిలుపునిచ్చారు. గురువారం నస్కల్‌లో దానికి సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దళితుల మీద దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను అమలు చేయడానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం సిద్ధపడడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో పంగ ప్రశాంత్, కొమ్మాట మోహన్, బొర్ర శ్రీకాంత్, మద్దికుంట బాను పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలనలో ఎస్పీ, డీఎస్పీ


రామాయంపేటలో పోలింగ్ వద్ద తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

రామాయంపేట(మెదక్): జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని గురువారం రామాయంపేట మండలంలో పోలింగ్ బూత్‌లను పరిశీలించి పోలీసులకు తగు సూచనలు చేశారు. ఆమె అక్కన్నపేట, రామాయంపేటలో బూత్‌లను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు శాంతియుతంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని పోలింగ్ కేంద్రాన్ని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి పరిశీలించారు. గురువారం పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ తీరు, పరిసరాలను పరిశీలించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ కలీముల్ల అధికారులు పాల్గొన్నారు.



కొత్తగా ఓటు హక్కు వినియోగించుకున్న యువతులు


మెదక్ పట్టణంలోని నవాబుపేటలో క్యూలో ఉన్న మహిళలు


సాధారణ ఓటర్లతో పాటు వరుసలో నిలబడిన కలెక్టర్ రాజర్షిషా

ఓటింగ్ ఉత్సాహం

- ఓటు హక్కు వినియోగించుకున్న అభ్యర్థులు
- రాష్ట్రంలోనే మెదక్ ఫస్ట్
- ప్రశాంతంగా పోలింగ్ పూర్తి

మెదక్: జిల్లాలోని నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. అక్కడక్కడా చెదురుమదురు ఘటనలు తప్ప అంతా ప్రశాంతంగానే జరిగింది. ఉదయం 6 గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన పోలింగ్ సిబ్బంది 7 గంటలకు పోలింగ్ ప్రారంభించారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల ప్రాంతంలో పోలింగ్ శాతం పెరిగింది. జిల్లాలో ఓవరాల్‌గా 80.28 శాతం పోలింగ్ నమోదైంది. మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికల బరిలో నిలబడిన అభ్యర్థులతో పాటు పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చేగుంట మండలం రుక్మాపూర్‌లో ఓ ఎన్‌ఆర్‌ఐ తన ఓటు వేసేందుకు సింగపూర్ నుంచి వచ్చి ఓటు వేశారు. పలు మండలాల్లో ఈవీఎంలు మొరాయించడంతో కొంతసేపు పోలింగ్ నిలిచి పోయింది. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను పువ్వులు, మామిడితోరణాలు, అరటి కొమ్మలతో అందంగా అలంకరించారు.

ఓటుహక్కు వినియోగించుకున్న అభ్యర్థులు

ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులతో పాటు పలువురు ప్రముఖులు తమ ఓటుహక్కును ఆయా నియోజకవర్గాలు, స్వగ్రామాల్లో వినియోగించుకున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా హవేళీఘణాపూర్ మండలం ఔరంగాబాద్ గిరిజన తండాలో తన ఓటును వినియోగించుకోగా, జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని మెదక్ మండలం మాచవరం గ్రామంలో ఓటు వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తన స్వగ్రామం రామాయంపేట మండలం కోనాపూర్‌లో తన కుటుంబీకులతో కలిసి ఓటు వేశారు. అలాగే మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు తన స్వగ్రామమైన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లిలో తన భార్య శివానిరెడ్డితో కలిసి ఓటు వేశారు. మెదక్ బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్ తన స్వగ్రామం నిజాంపేట మండల కేంద్రంలో ఓటువేశారు. అలాగే నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తన స్వగ్రామం కౌడిపల్లి మండలంలోని గోమారంలో ఓటు వేశారు. నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తన స్వగ్రామమైన మాసాయిపేట మండల కేంద్రంలో తన ఓటు వినియోగించుకున్నారు. అలాగే నర్సాపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి దంపతులు కౌడిపల్లి మండల కేంద్రంలో, బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్ దంపతులు నర్సాపూర్‌లోను ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తన స్వగ్రామం హవేళీఘణాపూర్ మండలం కూచన్‌పల్లిలో ఓటు వేశారు. అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ హేమలత శేఖర్‌గౌడ్ దంపతులు మనోహరాబాద్‌లో ఓటు హక్కువినియోగించుకున్నారు. మెదక్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ చంద్రపాల్, మల్లికార్జున్‌గౌడ్ మెదక్‌లో ఓటు వేశారు. మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ కొండన్ సావిత్రి సురేందర్‌గౌడ్ దంపతులు పట్టణంలో మెదక్ ఏరియా ఆస్పత్రి సూపరిండెట్ డాక్టర్ పీసీ. శేఖర్ దంపతులు మెదక్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్‌రెడ్డి సింగపూర్‌లో స్థిరపడ్డారు. అతను గురువారం తన స్వగ్రామానికి వచ్చి ఓటు వేసి ఆదర్శంగా నిలిచారు.

ఈవీఎంల మొరాయింపు

జిల్లాలోని పలు మండలాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. రామాయంపేట మండలం దామర చెరువు, అదే మండలంలోని అక్కన్నపేట; రామాయంపేట పట్టణంలోని 70వ, బూత్‌లో, చిన్నశంకరంపేట జంగారాయిలో నిజాంపేట మండల కేంద్రంలోని 105 పోలింగ్ బూత్‌లో, మనోహరాబాద్ మండలం 22, బూత్‌లో, శివ్వంపేట మండలం పిల్లుట్లలోని 166 బూత్‌లో, రేగోడు మండల కేంద్రంలోని 13వ బూత్‌లోను పెద్దశంకరంపేట మండలం శివ్వాయిపల్లిలో ఈవీఎంలు మొరాయించడంతో ఒక్కో పోలింగ్ బూత్‌లో గంట వరకు ఆలస్యం అయింది.

దివ్యాంగుల బూత్‌లకు అలంకరణ

ఓటింగ్ శాతం పెంచేందుకు జిల్లాలోని 579 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిలో నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల్లో 10 మహిళా పోలింగ్ బూత్‌లు, దివ్యాంగులకు ప్రత్యేకంగా రెండు బూత్‌లను ఏర్పాటు చేశారు. మెదక్ పట్టణ పరిధిలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో దివ్యాంగుల పోలింగ్ బూత్‌ను మామిడి తోరణాలు, అరటి కొమకమ్మలతో అలంకరించారు. అందులో మొదటి సారి ఓటు వినియోగించుకున్న యువత చేతులకు రంగులు అద్ది ఓపేపర్‌పై హస్తంతో ముద్రించిన ఓటర్లకు బహూకరించారు. రాగిజావ ఇవ్వడంతో పాటు, చిరుధాన్యాలు తింటేనే ఆరోగ్యం అని కొటౌట్లు ఏర్పాటు చేశారు.

ఐదు గంటల తర్వాత ఓటు కోసం

ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే ఓటు వేసేందుకు అనుమతి ఉండగా ఐదు గంటల తరువాత ఓటు వేసేందుకు క్యూలైన్‌లలో ఉన్న పలు పోలింగ్ బూత్‌లలో ఓటు వేసేందుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. అందులో భాగంగా నర్సాపూర్‌లోని 283 పోలింగ్ బూత్‌లలో 5 గంటల తరువాత 130 ఓటర్లు క్యూలైన్‌లో ఉండడంతో వారికి ఎన్నికల సిబ్బంది అనుమతులు ఇచ్చారు. అలాగే రామాయంపేట మండలం ధర్మారంలో వెల్దుర్తి మండల కేంద్రాల్లో ఆలస్యంగా ఓటు వినియోగించుకున్నారు.

రాష్ట్రంలోనే అత్యధిక పోలింగ్
జిల్లాలో 86.96 శాతం నమోదు

జిల్లాలోని మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 80.28 శాతం పోలింగ్ నమోదయింది. సాయంత్రం పోలింగ్ ముగిసేసరికి 86.96 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. అది రాష్ట్రంలోనే అత్యధికంగా పేర్కొన్నారు. దీనికి కారణం జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా చొరవనే చెప్పాలి. ఆయన ఎన్నికల షెడ్యూల్ రాక ముందు నుంచే శతశాతం ఓటింగ్ లక్ష్యంతో వివిధ రకాలుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

చెదురుమదురు ఘటనలు

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని మలు మండలాల్లో చెదురుమదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. వెల్దుర్తి మండలం మహ్మమద్ నగర్ పంచాయతీ పరిధిలోని గిరిజన తండాకు నర్సాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునితా లక్ష్మారెడ్డి కొడుకు శ్రీధర్‌రెడ్డి వెళ్లగా.. ఎందుకు వచ్చావంటూ గిరిజనులు వాగ్వాదానికి దిగి రాయితో కారుపై దాడి చేశారు. దీంతో కారు అద్దం పగిలి పోయింది. పాపన్నపేట మండలం కొత్తపల్లి పోలింగ్ బూత్‌వద్ద గుమిగూడిన బీఆర్‌ఎస్ కార్యకర్తలను పోలీసులు చెదర కొట్టారు. అలాగే రామాయంపేట మండలం కాంట్రీయాలలో పక్క గ్రామాల వారు వచ్చి బీఆర్‌ఎస్‌కు ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులు నిరసన తెలిపారు. మెదక్ పట్టణంలోని జూనియర్ కాలేజీలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తలు గొడవ పడి ఒకరిపై ఒకరు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసుకున్నారు.


చేగుంటలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు


హవేళీఘణాపూర్ మండలం ఔరంగాబాద్ తండాలో ఓటు వేసిన కలెక్టర్ రాజర్షిషా


కొర్విపల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్న కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు


ఓటువేసిన పద్మ, ఆమె కుటుంబ సభ్యులు


ఓటు వేసిన ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఆయన భార్య సుజాత


నిజాంపేటలో ఓటు వేసిన మెదక్ బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్


రామాయంపేట(మెక్): ఓటువేసిన మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, కుటుంబ సభ్యులు


కల్వకుంటలో ఓటు వేసిన మెదక్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి


ర్యాలమడుగులో ఓటర్ల సెల్‌ఫోన్‌లు


ఓటు వేసిన నర్సాపూర్ బీజేపీ అభ్యర్థి మురళీయాదవ్, ఆయన సతీమణి రాజమణి

కొత్త ఓటర్ల సంబురం


యువతికి జ్ఞాపిక అందజేస్తున్న పోలింగ్ సిబ్బంది

మెదక్ కలెక్టరేట్: జిల్లాలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కొత్తగా ఓట్లు వేసిన యువతులు ఎంతో సంబరపడ్డారు. మెదక్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో 8 మంది యువతులు మొదటిసారి తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా వారు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అలాగే మొదటిసారి ఓటు వేసిన యువతను ప్రోత్సహించడానికి పోలింగ్ సిబ్బంది వారి అరచేతిని పేపర్‌పై అచ్చువేసి జ్ఞాపక పత్రం అందజేశారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతల ఘర్షణ

ఒకరిపై మరొకరు ఫిర్యాదులు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు తమపై దాడి చేశారని ఆరోపిస్తూ ఒకరిపై ఒకరు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల 131 పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిని ఒకరు తోసుకోవడంతో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గంగాధర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు ఆ పార్టీ నాయకుడు సాదక్ మెదక్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘర్షణ విషయం తెలుసుకున్న పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను స్టేషన్‌కు తరలించారు. అనంతరం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రోహిత్ భార్య శివాని కారులో పోలీస్ స్టేషన్ వద్దకు రాగా అక్కడే ఉన్న కొంత మంది శివాని కారుపై దాడికి యత్నించారు. దీంతో రెండు వర్గాల వారు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రెండు పార్టీలకు చెందిన ప్రధాన నేతలు రావడంతో కొంత ఉద్రిక్తత నెలకొంది.


పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న శివాని

మహిళపై దాడి చేస్తారా: శివాని

మహిళా ఎమ్మెల్యే ఉన్న ప్రాంతంలో ఒక మహిళపై బీఆర్‌ఎస్ నేతలు దాడి చేస్తారా? అంటూ కాంగ్రెస్ అభ్యర్థి రోహిత్ భార్య శివాని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కొర్విపల్లిలో ఓటువేసి మెదక్ మీదుగా రామాయంపేట వెళ్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ నాయకులు మెదక్ పట్టణంలో తనపై దాడి చేయడానికి ప్రయత్నించారని శివాని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యే మరొక మహిళపై తన అనుచరులతో దాడి చేయించడం దారుణమని శివాని వాపోయారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు అందజేశారు.

సింగపూర్ నుంచి వచ్చాం.. ఓటు వేశాం


రుక్మాపూర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్న ప్రశాంత్‌రెడ్డి దంపతులు

చేగుంట(తూప్రాన్): ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసేందుకు సింగపూర్ నుంచి ప్రశాంత్‌రెడ్డి దంపతులు మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రుక్మాపూర్‌కు వచ్చారు. గతంలో జరిగిన పలు ఎన్నికల్లో వారు ఓటు హక్కు వినియోగించుకోకపోవడంతో సింగపూర్‌లో ఉంటున్న రుక్మాపూర్‌కు చెందిన బస్కె ప్రశాంత్‌రెడ్డి అనిత దంపతుల ఓట్లు తొలగించారు. దీంతో వారు తమకు అవకాశం కల్పించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను ఇటీవలే మెయిల్ ద్వారా అభ్యర్థించారు. దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్‌కు రాష్ట్ర ఎన్నికల అధికారి తెలియజేయగా ప్రశాంత్ రెడ్డి దంపతులకు ఓటువేసే అవకాశం కల్పించారు. గురువారం రుక్మాపూర్‌లో ఓటు హక్కును ప్రశాంత్‌రెడ్డి అనిత వినియోగించుకున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవడంపై వారు సంతోషం వ్యక్తం చేశారు.

సునీతారెడ్డి కుమారుడి కారుపై దాడి

- కౌడిపల్లి మండలం లింగంపల్లి తండాలో ఘటన
- కాంగ్రెస్ గూండాలపనే: శశిధర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కొట్టాల పంచాయతీ లింగంపల్లితండాకు వెళ్లిన బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డి కుమారుడు శశిధర్‌రెడ్డి కారుపై వెల్దుర్తి మండలం మహ్మద్‌నగర్‌తండా గిరిజనులు దాడిచేశారు. దీంతో కారు ముందు అద్దం ధ్వంసమైంది. గురువారం శశిధర్‌రెడ్డి తన కారులో లింగంపల్లి పోలింగ్ బూత్‌కు వెళ్లి అక్కడి నుంచి తండాకు వెళ్లారు. మహ్మద్‌నగర్ తండాకు చెందిన యువకులు ఆయన కారుకు అడ్డుగా బైక్‌లను పెట్టి తండాకు డబ్బులు పంచేందుకు వచ్చారా అంటు శశిధర్‌రెడ్డితో గొడవకు దిగారు. అంతలోనే తండాకు చెందిన సంగ్యానాయక్ గనెట్ రాయితో కారుపై దాడిచేశాడు. శశిధర్‌రెడ్డి కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని కౌడిపల్లి ఎస్‌ఐ, సీఐ పరిశీలించారు. దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామని వారు చెప్పారు.


కౌడిపల్లి : లింగంపల్లితండాలో మాట్లాడుతున్న శశిధర్‌రెడ్డి

కాంగ్రెస్ గూండాలపనే

సునీతారెడ్డి ప్రజాదరణ చూసి ఓర్వలేకనే తనపై కాంగ్రెస్ గూండాలు దాడిచేశారని శశిధర్‌రెడ్డి తెలిపారు. తండాలో పోలింగ్ కేంద్రం లేదని చెప్పడంతో వెనుకకు వస్తుండగా కాంగ్రెస్‌పార్టీకి చెందిన వ్యక్తులు ఉద్దేశ పూర్వకంగా దాడిచేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


సంగారెడ్డిలోని పోలింగ్ కేంద్రం వద్ద క్యూ లైన్‌లో నిల్చున్న ఓటర్లు


నారాయణఖేడ్: ర్యాకల్ గ్రామంలో బారులు దీరిన మహిళలు

ఈవీఎంలలో ఓటరు తీర్పు

ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద జనం పోటెత్తారు. ఉదయం నుంచే బారులుదీరారు. బరిలో నిలిచిన అభ్యర్థులు కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడంతో అధికారులు, నాయకులు ఊపిరిపీల్చుకున్నారు.


కొహెడలో తొలిసారి ఓటేసిన యువతి


సిద్దిపేట : చంటిబిడ్డతో ఓటేసేందుకు వచ్చిన మహిళ


దుబ్బాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో క్యూలైన్‌లో నిలబడిన పురుషులు


చిన్నశంకరంపేటలో తొలిసారి ఓటేసిన యువ ఓటర్లు


వైద్యశిబిరంలో మంత్రి హరీశ్


జహీరాబాద్: అల్లీపూర్‌లో..


జిన్నారం: గడ్డపోతారంలో ఓటుహక్కును వినియోగించుకున్న అయ్యప్ప స్వాములు


సంగారెడ్డి : ఓటు వేసేందుకు వృద్ధుడిని వీల్ చైర్‌లో తీసుకొస్తున్న పోలింగ్ సిబ్బంది


దుద్దెడలో ఓటేసి సెల్ఫీ తీసుకుంటున్న దంపతులు


కొహెడలో ఓటు వేసిన యువతులు


చేర్యాల: వీల్ చైర్‌లో దివ్యాంగుడిని తీసుకొస్తున్న సిబ్బంది


ఓటర్ల వేలికి సిరా పెడుతున్న అధికారి


నంగునూరు : రాంపూర్‌లో పోలీసుల సహాయంతో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధురాలు


జిన్నారం: బొల్లారంలో ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చున్న మహిళలు


సంగారెడ్డి : పోలింగ్ కేంద్రానికి తరలివస్తున్న వృద్ధురాళ్లు


సిద్దిపేట : వీల్‌చైర్ పై ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న సిబ్బంది

ఈవీఎంల అడ్డగింత


అధికారికి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జగదేవపూర్(గజ్వేల్): కుకునూర్ పల్లి మండలం పీటీ వెంకటాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ ఫొటో గుర్తు పక్కన ఇంకుతో మార్కింగ్ చేశారని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఈవీఎంలను తరలింపును గురువారం రాత్రి అడ్డుకున్నారు. వాటిని చెక్ చేసిన తర్వాతనే తరలించాలని పట్టుబట్టారు. రాత్రి ఎనిమిదిన్నర వరకు పోలింగ్ కేంద్రాల్లోనే ఉంచారు. దీంతో ఎన్నికల అధికారులు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు గ్రామానికి చేరుకుని ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో నాయకులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. సమస్య సద్దుమణగడంతో ఈవీఎంలను తరలించారు.

తొలి ఓటు సంబురం

- మొదటిసారి ఓటు ఉపయోగించుకున్న యువత
- నిజాయితీగా ఓటేయడం గర్వంగా ఉందంటున్న పౌరులు

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రజాస్వామ్యం విజయవంతం కావడంలో ఓటు హక్కు ఎంతో కీలకం. ముఖ్యంగా ఈ విషయంలో యువత బాధ్యతగా ఓటు వేయాల్సి ఉంటుంది. సిద్దిపేట జిల్లా పరిధిలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఇందులో 18 నుంచి 19 ఏళ్ల వయస్సు గల ఓటర్లు 28535 మంది ఉన్నారు. అత్యధికంగా గజ్వేల్‌లో 8844, హుస్నాబాద్‌లో 7293, సిద్దిపేట 6337, దుబ్బాకలో 6061 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 80 శాతానికి పైగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గురువారం జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి సారి ఓటు వేసిన పలువురి అభిప్రాయాలు వారి మాటల్లో...



బాధ్యత పెంచింది



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకోవడం గొప్ప అనుభూతి. కొంతవరకు రాజకీయాల గురించి తెలుసు. చట్టసభలకు ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఓటు వేసిన తర్వాత నాపై పౌరునిగా మరింత బాధ్యత పెరిగింది.

– వివేక్‌సాయిగౌడ్, చంద్లాపూర్, సిద్దిపేట

సంతృప్తినిచ్చింది



ఫస్ట్‌టైం ఓటు వేయడం ఆనందంగా ఉంది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రతి పౌరుడు తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. దీనిపై ప్రజల్లో మరింత అవగాహన తీసుకురావాలి.

– గంద్యాడపు శ్రీహిత, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, మాచాపూర్, సిద్దిపేట

సంతోషంగా ఉంది



మొదటి సారి ఓటు హక్కును వినియోగించుకుని పరోక్షంగా పాలనలో భాగస్వాములం అయ్యామనే భావన బాగుంది. మంచి నాయకుడికే ఓటు వేశాను. భవిష్యత్‌లో కూడా తప్పకుండా ఓటువేస్తా.

–నంట భవానీరెడ్డి, కొండాపూర్, దుబ్బాక

నా బాధ్యతను నిర్వర్తించా..



మొదటి సారి ఓటు వేసి నా బాధ్యతను నిర్వర్తించాను. ఇక చట్టసభకు ఎన్నికైన నాయకులు ప్రజలకు సేవ చేయడం మరిచిపోకూడదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్టీ అందరికీ ఉపయోగపడే పథకాలు చేపట్టాలి.

– భూంపల్లి కార్తీక్‌రెడ్డి, రామ్‌నగర్, సిద్దిపేట

ధనిక, పేద తేడా లేనిది..



ధనిక, పేద, స్త్రీ, పురుష తదితర తేడాలు లేకుండా పొందే ఓటు హక్కును మొదటి సారి సక్రమంగా వినియోగించుకున్నాను. ఎన్నికైన నాయకులు సరిగా పనిచేయకుంటే అప్పటికప్పుడు తొలగించే అధికారం ఓటర్లకు కల్పించాలి.

–బొలుమల్ల శివాని, కొహెడ, హుస్నాబాద్

మరిచిపోలేని అనుభూతి



మొదటి సారి ఓటు వేయడం మరిచిపోని అనుభూతి. బాగా ఆలోచించి పనిచేసే ప్రభుత్వానికి ఓటు వేశా. నిజాయితీ పరులైన నాయకులను ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు ద్వారానే కలుగుతుంది.

– దుద్దెడ అజయ్, తొగుట, దుబ్బాక

పౌరుడిగా నా బాధ్యత



ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా పూర్తిస్థాయి పౌరుడిగా నాపై మరింత బాధ్యత పెరిగింది. ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ప్రతినిధులను ఎన్నుకోవడం మొదటి విధిగా భావిస్తున్న. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజాయితీగా ఓటు వేశాను.

– పిట్ల సందీప్, నారాయణరావుపేట, సిద్దిపేట

మొదటి ఓటు వేయాలని ఎదురుచూశా..



కొల్చారం(నర్సాపూర్): మొదటి సారిగా ఓటు వేసేందుకు రెండేళ్లుగా ఎదురు చూస్తున్న. ఇప్పటికీ నా కల నెరవేరింది. యువతకు ఉపాధి కల్పించాలన్న నిర్ణయంతో ఏకీభవించే పార్టీకి ఓటు వేశా. ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరికి తెలియజేయాలి.

– కుమార్,చిన్న ఘనాపూర్, కొల్చారం మండలం

ఓటెయ్యడానికి వచ్చి.. గుండెపోటుతో మృతి


స్వామి (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): బతుకు దెరువు కోసం వలస వెళ్లిన ఓ వ్యక్తి ఓటు వేడానికి సొంతూరుకు వచ్చి గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా అక్బర్ పేట-భూంపల్లి మండల పరిధిలోని రుద్రారంలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన బాస స్వామి (52)కి ఇల్లు తప్ప ఎలాంటి ఆస్తి లేదు. చాలా కాలం క్రితం బతుకు దెరువు కోసం హైదరాబాద్‌కు వలస వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ భార్య కళావతి, నలుగురు పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో స్వామి తన ఓటు హక్కును వినియోగించుకోవడానికి రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. గురువారం ఒటేయడానికి పోలింగ్ స్టేషన్ వద్దకు వెళ్లాడు. ఆధార్ కార్డు, ఓటరు స్లిప్ తీసుకురాకపోవడంతో మళ్లీ ఇంటికి వెళ్లాడు. వాటిని తీసుకుని వస్తుండగా ఛాతిలో నొప్పిగా ఉందంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గ్రామస్తులు సపర్యలు చేస్తుండగానే స్వామి అక్కడికక్కడే తుది శ్వాస వదిలాడు. దీంతో మృతుడి కుటుంబంలో విషాదం నెలకొంది.

పోలింగ్ సరళిపై అభ్యర్థుల ఫిర్యాదు


పోలింగ్ కేంద్రం వద్ద వివిధ పార్టీల నాయకులు

సిద్దిపేటజోన్: స్థానిక శ్రీ చైతన్య స్కూల్ పోలింగ్ స్టేషన్(170)లో ఓటర్ల స్లిప్, వీవీ ప్యాట్ ల మధ్య లెక్క పొంతన లేదని ఆయా పార్టీల అభ్యర్థులు గురువారం రాత్రి అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలింగ్ సందర్భంగా 924 ఓటర్ల స్లిప్‌లకు గాను పోలింగ్ ప్రక్రియ అనంతరం వీవీ ప్యాట్‌లలో 920 మాత్రమే ఉన్నాయని ఏజెంట్లు ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఒక దశలో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీల అభ్యర్థులు పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఎన్నికల అధికారులతో ఇదే విషయం పై చర్చించారు. సమస్య తీవ్రతరం కాకుండా పెద్ద ఎత్తున పోలీసులు అక్కడికి చేరుకున్నారు. సమస్య గురించి అభ్యర్థులు పై అధికారులకు లేఖ రూపంలో ఫిర్యాదు చేయడంతో సద్దుమణిగింది

డబ్బు పంచిన వ్యక్తిపై కేసు

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామంలో కొంత మంది ఓటర్లకు డబ్బులు పంచుతుండగా ఎఫ్ఎస్‌టీ టీం పట్టుకుంది. సమాచారం అందుకున్న సీఐ కృష్ణ అక్కడికి చేరుకుని డబ్బు పంచుతున్న వేణుగోపాల్ రెడ్డిని అదుపులోకి తీసుకుని అతని నుంచి రూ.88వేల నగదే స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఎస్‌టీ టీం ఇన్‌చార్జి యాదవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.